సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 20 । మార్చి । 2023



రైతుల సంతకాలు ఫోర్జరీ

రైతులకు సమాచారం ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో నోటీసులిచ్చినట్లు చూపుతూ హైటెన్షన్ టవర్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. 8లో▸



అవిశ్వాసం అటకెక్కినట్లేనా..?

పురపాలక సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస నోటీసులు త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతున్నాయి. 8లో▸

భారీగా పెరిగిన పీహెచ్‌డీ ఫీజులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ ఫీజులను భారీగా పెంచారు. ఇప్పటివరకు ఏటా రూ.2 వేలు ఉన్న ఫీజును ఆర్ట్స్, సోషల్, సైన్స్ కోర్సులకు ఏటా రూ.20 వేలు, అయిదేళ్లకు రూ.1,20,000 కాగా.. సైన్స్, ఇంజినీరింగ్ కోర్సులకు ఏడాదికి రూ.25 వేలు. అయిదు సంవత్సరాలకు రూ.1,45,000కు పెంచారు. గతంలో పీజీ కోర్సుల ఫీజులను పెంచిన వర్సిటీ అధికారులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సుల ఫీజులను సైతం పెంచనున్నారు.

న్యూస్‌రీల్

జైలు నుంచి నిహారిక విడుదల

నవీన్ హత్య కేసు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో సంచలనం రేపిన నవీన్ హత్య కేసులో నిందితురాలు నిహారిక జైలు నుంచి విడుదలైంది. ఈ కేసులో ఏ–3 ముద్దాయిగా ఉన్న నిహారికను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో చర్లపల్లి జైలు నుంచి ఆమెను విడుదల చేశారు. నవీన్ హత్య కేసులో ప్రధాన నిందితుడు హరిహరకృష్ణకు సహకరించారన్న ఆరోపణలతో హసన్, నిహారికను పోలీసులు గతనెల 6న అరెస్ట్ చేశారు. హత్య జరిగిన విషయాన్ని దాచి, హత్యకు సహకరించిందని నిహారికను నిందితురాలిగా చేర్చి పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. హయత్‌నగర్ కోర్టులో వారిద్దరినీ హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఇటీవల బెయిల్ కోసం నిహారిక దరఖాస్తు చేసుకోగా శనివారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆదివారం ఉదయం ఆమె బయటికొచ్చింది. తన స్నేహితుడు నవీన్‌ని హరిహరకృష్ణ కిరాతకంగా హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా కోసి గుండెను బయటికి తీసిన విషయం విదితమే. నిహారికను వేధిస్తున్నాడనే కోపంతోనే నవీన్‌ను చంపినట్లు పోలీసుల విచారణలో హరిహరకృష్ణ అంగీకరించిన సంగతి తెలిసిందే.

ఉత్సాహంగా ముగిసిన సెమినరేట్‌-2023



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నందిగామ: విద్యార్థుల నృత్యాలు.. ఆకట్టుకునే నాటకాలు.. అబ్బురపరిచే విన్యాసాలు.. వినసొంపైన పాటలతో సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ హోరెత్తింది. సెమినరేట్‌–2023ను ఆదివారం ఘనంగా ముగించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా అలరించాయి. పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ రాష్ట్రాల్లోని వేషభాషలతో ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. హిందీ, ఇంగ్లిష్, మరాఠీ, కన్నడ తదితర సినిమాల్లోని పాటలకు ఉత్సాహంగా స్టెప్పులు వేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, డిప్యూటీ డైరెక్టర్ శ్యాంసుందర్, క్యాంపస్ అడ్మిన్ సీవీ మోహన్, స్టూడెంట్స్ కౌన్సిల్ సభ్యులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో మహిళలకు మగ్గం వర్క్స్, బ్యూటీపార్లర్, టైలరింగ్, కాస్ట్యూమ్, జ్యువెలరీ తయారీ, పురుషులకు మొబైల్ రిపేరింగ్, టూవీలర్ మెకానిక్స్, సీసీటీవీ కెమెరా రిపేరింగ్ అండ్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 19–45 సంవత్సరాల మధ్య వయసు ఉండి పదో తరగతి చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం, ఉచిత యూనిఫాం, టూల్ కిట్స్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతోపాటు నాలుగు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో చిలుకూరులోని ఆర్‌సెటీ కేంద్రంలో సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 86390 79122, 79819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లేనిది ఉన్నట్టు!

అద్దె రోగులు.. అతిథి అధ్యాపకులు

- రూ.500 కూలీ.. వసతి .. మూడు పూటలా భోజనం
- గ్రామాల నుంచి గుట్టుగా బస్సుల్లో ఆస్పత్రులకు తరలింపు
- జిల్లాలోని పలు మెడికల్ కాలేజీల్లో ఇదీ పరిస్థితి
- మెడికల్ బోర్డు తనిఖీల సమయంలో హడావుడి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పలు ప్రైవేటు మెడికల్ కాలేజీలు గుర్తింపు రెన్యూవల్స్, పీజీ కోర్సులకు అనుమతుల కోసం అడ్డదారులు తొక్కుతున్నాయి. మెడికల్ బోర్డు తనిఖీలకు వచ్చే సమయంలో అద్దె రోగులు.. అతిథి అధ్యాపకులతో హడావుడి చేస్తున్నాయి. ఒక్కొక్కరికి రూ.500 కూలీ చెల్లించి.. మూడు పూటలా భోజనం.. వసతి కల్పించి గ్రామాల నుంచి గుట్టుగా బస్సుల్లో ఆస్పత్రులకు తరలిస్తున్నాయి. మెడికల్ బోర్డు అధికారుల తనిఖీల తర్వాత ఎవరి ఇళ్లకు వారిని పంపించేస్తున్నాయి. యాక్టింగ్ రోగులను చూసి.. అప్పటికే వివిధ రుగ్మతలతో బాధపడుతూ చికిత్సల కోసం ఆయా ఆస్పత్రుల్లో చేరిన నిజమైన రోగులు, వారి వెంట వచ్చిన బంధువులు ఈ తంతు చూసి నివ్వెరపోతున్నారు. జాతీయ వైద్య కమిషన్ ఇటీవల జిల్లాలోని ఓ ప్రముఖ మెడికల్ కాలేజీలో తనిఖీలు చేపట్టిన సమయంలో ఇదే సీన్ వెలుగు చూసింది. అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో యాజమాన్యాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ప్రత్యక్షంగా వీక్షించిన వారు ఆ దృశ్యాలను వీడియో తీసి.. సోషల్ మీడియా వేదికగా షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

అరకొర శిక్షణతో అవస్థలు

మొయినాబాద్, చేవెళ్ల, గండిపేట కేంద్రంగా ఐదు మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆస్పత్రులు కొనసాగుతున్నాయి. ఎంబీబీఎస్, పీజీ కోర్సులు అందిస్తున్నాయి. ఆయా వైద్య కళాశాలలు నిబంధనల మేరకు పనిచేస్తున్నాయా.. లేదా వంటి అంశాలను తనిఖీ చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ ఎప్పటికప్పుడు తమ బృందాలను ఆయా కాలేజీలకు పంపుతుంది. వైద్య విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, రీసెర్చ్ అండ్ లేబరేటరీ, రికార్డుల నిర్వహణ, సీనియర్ అధ్యాపకులు, అనుబంధ ఆస్పత్రులు.. ఆస్పత్రులకు వచ్చే ఔట్ పేషంట్లు, ఇన్‌పేషంట్ల వంటి అంశాలను తనిఖీ బృందం పరిశీలిస్తుంది. మెజార్టీ కాలేజీల్లో వైద్య విద్యార్థుల నిష్పత్తి మేరకు మౌలిక సదుపాయాలు లేవు. ఇన్‌పేషంట్లే కాదు అవుట్ పేషంట్లు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులతో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ప్రాక్టికల్స్ కూడా ఆశించిన స్థాయిలో నిర్వహించడం లేదు. ఓపీ, ఐపీ రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఆశించిన స్థాయిలో వైద్య విద్యను నేర్చుకోలేకపోతున్నారు. తీరా కోర్సు పూర్తి చేసుకుని బయటికి వచ్చిన తర్వాత ఇబ్బంది పడాల్సి వస్తోంది. చాలా తక్కువ వేతనాలకే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎంటడీలుగా, ఎమర్జెన్సీ విభాగాల్లో పని చేస్తున్న సీనియర్లకు అసిస్టెంట్లుగా పని చేయాల్సి వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి మేనేజ్‌మెంట్ కోటాలో పిల్లలను ఎంబీబీఎస్‌లో చేర్పించిన తల్లిదండ్రులు సైతం కెరీర్ విషయంలో పిల్లలు పడుతున్న ఇబ్బందులను చూసి ఆందోళన చెందుతున్నారు.

తనిఖీలకు ముందే లీకులు

గుట్టుగా చేపట్టాల్సిన తనిఖీలు రెండు మూడు రోజుల ముందే కాలేజీ యాజమాన్యాలకు తెలిసిపోతున్నాయి. దీంతో ముందే అప్రమత్తమవుతున్నాయి. వైద్య విద్యార్థుల హాజరు రికార్డులు, ప్రయోగశాలలు, వాటిల్లో ఉండాల్సిన మెటీరియల్, రికార్డులు, ఫ్యాకల్టీ, వారికి చెల్లిస్తున్న వేతనాలు, ఇతర మౌలిక సదుపాయాలు.. ఇలా ప్రతిదీ పక్కాగా అరేంజ్ చేస్తున్నాయి. ఉచిత వైద్య శిబిరాలు, వైద్య పరీక్షల పేరుతో గ్రామాల నుంచి గుట్టుగా ప్రజలను ఆస్పత్రులకు తరలిస్తున్నాయి. వారు అడిగినంత కూలీ ఇచ్చి తీసుకొస్తున్నాయి. తనిఖీ బృందాల ముందు వారు కూడా ఓ సాధారణ రోగిలా యాక్టింగ్ చేస్తుండటం విశేషం. తనిఖీలకు వచ్చిన బృందాలకు ఈ విషయం తెలిసీ యాజమాన్యాలు ఇచ్చే అమ్యామ్యాలకు అలవాటు పడి అన్నీ సవ్యంగా ఉన్నట్లు తప్పుడు రిపోర్టులు చేతికిచ్చి.. కిమ్మనకుండా వెనుతిరుగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్య విద్య నాణ్యత, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

మెడికల్ కౌన్సిల్‌దే బాధ్యత



మెడికల్ కాలేజీలు గ్రామాలకు దూరంగా ఉంటున్నాయి. అధ్యాపకులు చాలా పరిమిత సంఖ్యలో ఉంటున్నారు. కాలేజీల నిష్పత్తికి తగినంత మంది అధ్యాపకులు ఉన్నారా? లేదా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని కొత్త కాలేజీలకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఈ విషయాన్ని మెడికల్ కౌన్సిల్ పట్టించుకోకపోవడంతో వైద్య విద్య నాసిరకంగా తయారవుతోంది. కాలేజీల్లో తమ పిల్లలను చేర్పించే ముందే తల్లిదండ్రులు ఆయా మెడికల్ కాలేజీల్లోని మౌలిక సదుపాయాలను పరిశీలించాలి. విద్యార్థులు కాలేజీలో ఫ్యాకల్టీ, ఓపీ, ఐపీ రోగులపై ఆరా తీయాలి. అన్నీ నిర్ధారించుకున్న తర్వాతే అందులో చేరాలి.

– డాక్టర్ నరేంద్రనాథ్, మాజీ డైరెక్టర్, నిమ్స్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత

- వైద్యులు సేవాదృక్పథంతో పనిచేయాలి
- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఆమనగల్లు: వైద్యులు సేవాదృక్పథంతో పనిచేయాలని వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోనికి రాని వైద్య చికిత్సలకు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు సహకారం అందించాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రతిమ ఆస్పత్రి సహకారంతో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అనురాధతో కలిసి మంత్రి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా, మానవతా దృక్పథంతో పనిచేయాలని ఆయన సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధర కల్పించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు మార్కెట్‌కమిటీల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్డియాలజీ వైద్య బృందం డా.రాజ్ కుమార్‌యాదవ్, డాక్టర్‌విక్రం గౌడ్ ఆధ్వర్యంలో 380 మందికి గుండె పరీక్షలు నిర్వహించి ఉచితంగా టూడీ ఈకో, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, మున్సిపాలిటీ టీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు సరిత పంతునాయక్, రమేష్‌నాయక్, సుభాష్, జైపాల్‌రెడ్డి, లాలయ్యగౌడ్, సయ్యద్ ఖలీల్, మార్కెట్ కార్యదర్శి సరోజ, సూపర్‌వైజర్ శ్రీశైలం, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

బండోనిగూడలో వడగళ్ల వాన

నందిగామ: మండల పరిధిలోని బండోనిగూడ శివారులో ఆదివారం సాయంత్రం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. మద్దూరు శివారు నుంచి చేగూరు శివారు వరకు కేవలం అరకిలోమీటరు మేర వర్షం కురవడం విశేషం. సుమారు 20 నిమిషాల పాటు వర్షం కురిసింది. గ్రామ శివారులో ఒకవైపు వర్షం కురిసి మరోవైపు చినుకు కూడా కురవక పోవడంతో స్థానికులు చర్చించుకున్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కనీస వేతన చట్టం అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిర్వహించతలపెట్టిన మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీని జయప్రదం చేసేందుకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత ఆదివారం షాద్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్మికులకు కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి రోజురోజుకూ తగ్గిస్తూ వారి జీవితాలతో ఆటలాడుతోందని విమర్శించారు. కార్మికులకు కనీసం నెలకు రూ.26 వేల వేతనం, పంటలకు గిట్టుబాటు ధర, ఇందనం ధరలను అదుపుచేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో మహా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్, ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, రవి, లలిత, సత్యం, కుర్మయ్య, చంద్రమౌళి, రాజశేఖర్, కావలి రాజు, సాయిలు, వెంకటేశ్ యాదయ్య, పాండు నాయక్, యాదయ్య, శ్రీనివాస్, ధనుంజయ్, శేఖర్, రమేష్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి

మంత్రి సబితారెడ్డి



అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: నిరుద్యోగ యువత కష్టపడి చదివి పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ఆకాంక్షించారు. పోలీస్ ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇంద్రన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తూనే మరోవైపు పేద,మధ్య తరగతి యువతీయవకులకు కోచింగ్ సెంటర్‌కు వేల రూపాయలు కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అభ్యర్థులు సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సుమన్, రవినాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య, స్టడీ సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. పేపర్ లీకేజీని నిరసిస్తూ ఆదివారం కార్పొరేషన్ పరిధి మందమల్లమ్మ చౌరస్తాలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ పాలనలో రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు అపహాస్యంగా మారాయని, తాజాగా టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీనే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో అవినీతికి పాల్పడుతూ డబ్బులకు అమ్ముకుని నిరుద్యోగ యువత పొట్టగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్, సింగరేణి పరీక్షా పత్రాల లీకేజీ, ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షల్లో అవకతవకలు, గ్రూప్–1 పత్రాల లీక్‌లకు బాధ్యత వహిస్తూ కేటీఆర్ రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదగిరిరెడ్డి, గెల్లా సుభాష్ రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, సారిలాల్, బాలు పాల్గొన్నారు.



మీర్‌పేట: మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం..

మొయినాబాద్: నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మొయినాబాద్‌లో నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపణలు వస్తున్నా కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, నారాయణపురం మహేందర్ ముదిరాజ్, మల్లేష్‌గౌడ్, జంగారెడ్డి, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, భాస్కర్, రమేష్, రాఘవరెడ్డి, బిక్షపతి, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమార్, సత్యనారాయణ, నరేందర్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

పంచ తంత్రం

- మరో పదిహేను రోజుల్లో పదో తరగతి పరీక్షలు
- ఐదు సూత్రాలతో సత్ఫలితాలకు అవకాశం
- ఈసారి వంద శాతం సిలబస్‌తో సబ్జెక్టుకు ఒకే పేపర్
- పక్కా ప్రణాళికతో చదివితే సునాయాస విజయం

సాక్షి, సిటీబ్యూరో: మరో పదిహేను రోజుల్లో పదో తరగతి పరీక్షలు ఆరంభం కానుండటంతో విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. ఈసారి వంద శాతం సిలబస్‌తో పాటు ఒకే పేపర్, ప్రశ్నపత్రంలో నో చాయిస్ అంశం కూడా వారిని సతమతం చేస్తోంది. మరోవైపు పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేయకుండా తల్లిదండ్రులు హై–ఎక్స్‌పెక్టేషన్‌లు పెట్టుకోవడం కూడా విద్యార్థుల్లో ఒత్తిడి పెరగటానికి ఒక కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. పరీక్షల సమయంలో ఆందోళన, ఒత్తిడి ఉండడం సహజమైనప్పటికీ అది శ్రుతి మించితే మాత్రం ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. పరీక్షలు పదిహేను రోజులే గడువు ఉండటంతో ఇప్పటి వరకు చదివిన అంశాల రివిజన్‌ను పక్కా ప్రణాళికతో చదువుతూ పంచ సూత్రాలు పాటిస్తే సత్ఫలితాలు సాధించే అవకాశాలున్నాయని వారు సూచిస్తున్నారు.

పంచ సూత్రాలివే..

- ముందుగా విద్యార్థుల మానసిక స్థితి, ధోరణి బాగుండే విధంగా చూసుకోవాలి. పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. సందేహాలను ఉపాధ్యాయుల వద్ద నివృత్తి చేసుకోవాలి.
- ఆయా సబ్జెక్టులపై పట్టు అవసరం. తన మీద తనకు నమ్మకం ఉండాలి. కఠిన అంశాలపై పట్టు పెంపొందించుకోవాలి. సులువైనవి చివరకు చదవాలి. అన్నింటినీ ఎక్కువసార్లు మననం చేసుకోవాలి. ఏదైనా సాధించగలుగుతాననే ధీమా ఉంటే లక్ష్య సాధనకు అడ్డంకులు తొలగుతాయి.
- పాఠ్యాంశాల్లో పూర్తిస్థాయిలో రాణించడానికి ఏకాగ్రత అవసరం. ఇందుకు నిత్యం ధ్యానం, యోగ చేయాలి.
- పరీక్షల సన్నద్ధం సమయంలో ముఖ్యంగా క్రమశిక్షణ అవసరం. పరీక్షల వేళ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండేలా ప్రయత్నించాలి. మొబైల్, టీవీల దరిచేరనీయొద్దు. ఆటలు, అనవసర ముచ్చట్లకు స్వస్తి పలకాలి. ఇప్పుడు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందనే విషయాన్ని గుర్తించాలి.
- విద్యార్థుల దృష్టంతా చదువుపై కేంద్రీకరించాలి. దీనికి అధ్యాపకులు, తల్లిదండ్రులు కూడా సహకారం అందించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణం కల్పించాలి.



ఎమ్మెల్సీ కసిరెడ్డి గృహప్రవేశం


ఎమ్మెల్సీ కసిరెడ్డితో మంత్రి నిరంజన్‌రెడ్డి


ఎమ్మెల్సీతో ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

హాజరైన వివిధ పార్టీల నేతలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం నూతన గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని సన్మానించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మంద జగన్నాథ్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, టీడీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి యాదీలాల్, వైఎస్సార్ టీపీ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్, అనురాధ, దశరథ్‌నాయక్, ఎంపీపీలు నిర్మల శ్రీశైలంగౌడ్, అనిత, కమ్లీ మోత్యానాయక్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

షాబాద్: ఫిట్స్‌తో కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల వెంకటయ్య(70) శనివారం తన ఇంట్లోనే ఫిట్స్ రావడంతో కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాలరాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగిన కూలీ..

మొయినాబాద్/చేవెళ్ల: భార్యతో గొడవపడి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం వికారాబాద్ జిల్లా దోమ మండలం లింగన్‌పల్లి గ్రామానికి చెందిన మురళీకృష్ణ(32) అతడి భార్య భాగ్యతో కలిసి బతుకుదెరువుకోసం చేవెళ్లకు వలస వచ్చారు. అద్దెకు ఉంటూ అడ్డా కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఈ నెల 16న మురళీకృష్ణ తన భార్యతో గొడవపడి కల్లులో పురుగు మందు కలుపుకుని తాగాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడు ఆదివారం ఉదయం 5 గంటలకు మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

డీసీఎం డ్రైవర్ మృతి


శ్రీను(ఫైల్)

హయత్‌నగర్: స్కూటీపై ప్రయాణిస్తున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ కాలనీకి చెందిన కుంభం శ్రీను(23) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కీసరలో పని ముగించుకుని శనివారం రాత్రి స్కూటీ పై ఇంటికి వస్తున్నాడు. కుంట్లూర్ సమీపంలో శివపార్వతుల విగ్రహాల సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొని శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


సంగారెడ్డి(ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఎల్లంబి సంగారెడ్డి(50) ఈ నెల 15న రాత్రి రూ.5వేలు తీసుకుని ఇంట్లో చెప్పకుండా వెళ్లాడు. తర్వాత వస్తానని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన సంగారెడ్డి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై సంగారెడ్డి భార్య వరలక్ష్మీ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 9490617241 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘అవిశ్వాసం’ అటకెక్కినట్లేనా?

- మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లపై ఇచ్చిన నోటీస్‌లు ఎక్కడ..?
- 50రోజులు గడిచినా అధికారుల సమాధానం కరువు


ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఆశ.. నిరాశేనా..? పురపాలక సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస నోటీసులు త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతున్నాయి. అసమ్మతివాదుల ఆశలు గాలిలో దీపంలా కొట్టుమిట్టాడుతున్నాయి. చట్టాలను అమలు చేయాల్సిన పాలకులు వారికి అనుకూలంగా ఉంటేనే.. అమలుకు మొగ్గుచూపుతున్నారు. మున్సిపాలిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల కొలువుదీరిన నాలుగేళ్ల అనంతరమే వారిపై అవిశ్వాసం పెట్టేలా ఉన్న చట్టాన్ని టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 అక్టోబరులో మూడేళ్లకు కుదిస్తూ చట్ట సరవరణ చేసింది. జనవరి 26తో మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. ఈ ఏడాది డిసెంబర్‌లోగా సాధారణ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో అవిశ్వాస కాలపరిమితిని నాలుగేళ్లకు పెంచుతూ 2022 సెప్టెంబరులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపింది. గవర్నర్ బిల్లును పెండింగ్‌లో పెట్టడంతో అసమ్మతివాదులకు ఓ అవకాశం చిక్కినట్లయింది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతిపై అధికార బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెర లేపారు. జనవరి 27న కలెక్టర్, సీడీఎంఏలకు అవిశ్వాస నోటీసులు అందజేశారు. 30 రోజుల్లో అవిశ్వాసంపై అధికారిక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మరో వారం రోజులు గడిస్తే రెండు నెలలు పూర్తి కావస్తున్నా.. ఉన్నతాధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అవిశ్వాసాలపై అడుగు ముందుకేస్తే ఏమవుతుందోనని పాలకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా అవిశ్వాసబారిన పడిన, పడబోయే మున్సిపల్ చైర్మన్లు ఈ అవకాశాన్ని వారికి అనుకూలంగా మలుచుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాలుగేళ్ల కాలపరిమితి వరకు అవిశ్వాసానికి అవకాశం లేకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్లు వాదిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని మార్చి 20 వరకు న్యాయస్థానం గడువునిచ్చింది. ప్రభుత్వం ఎలాంటి సమాధానం చెబుతుందో వేచి చూడాల్సిందే! గవర్నర్ బిల్లు ఆమోదించనందున ఆలోపు అవిశ్వాస ప్రక్రియ పూర్తైంతుందని ఆశావహులు, అసంతృప్తి వాదులు మింగలేక కక్కలేక నిరాశ, నిస్పృహలతో నలిగిపోతున్నారు.

అభిప్రాయాలకు విలువనివ్వాలి



ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకు గౌరవం, విలువనివ్వాలి. మున్సిపల్ చైర్ పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసంపై ఓటింగ్ జరిపేందుకు అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. 30 రోజుల్లో అవిశ్వాసంపై నిర్ణయం తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదు. – భర్తకి జగన్, కౌన్సిలర్, బీఆర్‌ఎస్

చట్టాన్ని అమలు చేయాలి



చట్టాన్ని అమలు చేయాలి. చైర్‌పర్సన్‌పై చట్టానికి లోబడి అవిశ్వాస నోటీసులు పంపాం. అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన అవవసరాలకు అనుగుణంగా చట్టాలను సవరిస్తుండడం సరికాదు. పాలకుల ఒత్తిడిలకు లొంగి అధికారులు నోరు మెదపడంలేదు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదు. – పి. శంకరయ్య, కౌన్సిలర్, కాంగ్రెస్

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి..

కారు దగ్ధం


దగ్ధమైన కారు

కేశంపేట: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు దగ్ధమైంది. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజమున చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ షాద్‌నగర్‌లో కారు మెకానిక్‌గా కొనసాగుతున్నాడు. షాద్‌నగర్ నుంచి బోధునంపల్లికి వెళ్తుండగా ఆదివారం తెల్లవారుజమున సుమారు 4గంటల ప్రాంతంలో కేశంపేట శివారులోని చర్లమైసమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా గుర్తు తెలియని వాహనం అడ్డుగా రావడంతో దానిని తప్పించే ప్రయత్నంలో కారు రోడ్డు కిందకు వెళ్లింది. దీంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలను గుర్తించిన శివకుమార్ కారులో నుంచి దిగడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది.

చెరువులో పడి మహిళ మృతి

షాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరి ధిలోని అంతారం గ్రామానికి చెందిన గొల్లపల్లి విజయ(40) భర్త గోపాల్ శనివారం ఉ దయం వ్యసాయ పొలం వద్ద వరి, మొక్కజొన్న పంటలకు మందు పిచికారీ చేశారు. పని పూర్తయ్యాక వంటకు కట్టెలు తీసుకుని వస్తానని భర్తను వెళ్లమని చెప్పింది. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో భర్త పొలం వద్దకు వెళ్లి వెతికినా కనిపించలేదు. చెరువు కట్టపై ఫోన్ చున్నీ లభ్యమయ్యాయి. మందు పిచికారీ చేసిన చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి చెరువులో పడిపోయి ఉంటుందని భర్త అనుమానం వ్యక్తం చేశాడు. ఆమెకు ఫిట్స్ వస్తుందని చెప్పాడు. గ్రామస్తుల సాయంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు భర్త ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎండల్లో వానలు.. ఏమిటో ఈ బాధలు!

- మార్చిలో వణికిస్తున్న అకాల వర్షాలు
- మూడేళ్లలో ఈసారి అధిక వర్షపాతం
- సాధారణం కంటే పదింతలు అధికం

సాక్షి, సిటీబ్యూరో: మార్చిలో అకాల వర్షాలు వణికిస్తున్నాయి. వేసవిలో విరుచుకుపడుతున్నాయి. ఈదురు గాలులతో చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ తీగలు తెగిపోతున్నాయి. రోడ్లు జలమయమై ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. శివారు ప్రాంతాల్లో వడగళ్లు పడటంతో పండ్లు, కూరగాయలు, పూల తోటలకు అపార నష్టం వాటిల్లుతోంది. అల్పపీడనంతో ఏర్పడిన ద్రోణి ఆదివారం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి పశ్చిమ విదర్భ వరకు.. ఉత్తర అంతర్గత కర్ణాటక మరఠ్వాడా మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తున కొనసాగుతుండటంతో ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికే వరుసగా రెండు రోజులు నుంచి వర్షాలు కురుస్తుండగా మరో రెండు రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురు స్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ద్రోణుల ప్రభావంతో వేసవిలో సైతం వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత మార్చిలో సాధారణ వర్షపాతం కంటే పదింతలు అధికంగా నమోదు కావడం గమనార్హం.

మార్చిలో నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

జిల్లా	2020	2021	2022	2023
హైదరాబాద్	0.41	3.12	2.26	43.9
రంగారెడ్డి	0.24	3.19	2.50	36.1
మేడ్చల్-మల్కాజిగిరి	0.32	3.10	2.73	30.0

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజేంద్రనగర్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. ఆదివారం ఆమె డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ లక్ష్మీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపుల పేరుకుపోయిన చెత్తచెదారాలు, మట్టికుప్పలు, వ్యర్థాలను తొలగింపజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తచెదారాలు, ఇంటి నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేయరాదన్నారు. ప్రజలు డివిజన్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కార్పొరేటర్‌కు పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఎస్ఎస్ శేఖర్, ఎస్ఎఫ్ఏ వినయ్, లక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షులు మూర్తి, ప్రధాన కార్యదర్శి స్వామి, బీజేపీ నాయకులు బిట్కూరి సిద్ధేశ్వర్, పారిశుధ్య కార్మికులు, అధికారులు, సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉచితంగా మిల్లెట్స్ అల్పాహారం పంపిణీ


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: చిరుధాన్యాలు కండరాల పనితీరును మెరుగుపరుస్తాయని బీజేపీ సీనియర్ నాయకులు అంజన్‌కుమార్ యాదవ్, వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలో ఆదివారం ఉచితంగా మిల్లెట్స్‌తో తయారు చేసిన అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చిరుధాన్యాల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. కాల్షియం ఎక్కువగా ఉన్న మిల్లెట్స్‌ను ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొక్క బాల్‌రెడ్డి, కొమురయ్య, పసుపుల సందీప్‌ముదిరాజ్, సామ నవీన్‌రెడ్డి, పుస్తకాల నర్సింగ్‌రావు, బొక్క అనంతరెడ్డి, షాబాద్ విజయ్, కీర్తి శ్రీను, కృష్ణగౌడ్, అశోక్‌రెడ్డి, సోల్కర్‌రెడ్డి, విజయ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, స్వప్నరెడ్డి, వెంకటేష్, మల్లేష్, వేణు, కీర్తిజగన్, పసుపు దినేష్, రవి, పసుపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంతకాలు ఫోర్జరీ



హైటెన్షన్ టవర్ వద్ద ఆందోళన చేపట్టిన రైతులు


- వారికి తెలియకుండానే హైటెన్షన్ టవర్ల ఏర్పాటు
- పనులు అడ్డుకుని పీఎస్‌లో ఫిర్యాదు చేసిన రైతులు

కందుకూరు: రైతులకు సమాచారం ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో నోటీసులిచ్చినట్లు చూపుతూ ఓ ప్రైవేట్ విద్యుత్ సంస్థ హైటెన్షన్ టవర్ల ఏర్పాట్లు పనులు ప్రారంభించింది. దీంతో విషయం తెలుసుకున్న రైతులు అక్కడకి చేరుకుని ఆందోళన చేపట్టారు. వివరాల ప్రకారం.. మండలంలోని మీర్‌ఖాన్‌పేట పరిధిలోని సర్వే నంబర్ 79, 80, 178, 179లలో పట్టాదారులకు సమాచారం ఇవ్వకుండానే వరోరా కర్నూల్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం వైపు నుంచి మీర్‌ఖాన్ పేట్ పవర్‌గ్రిడ్‌కు హైటెన్షన్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు సమాచారం ఇవ్వకుండానే వారు టవర్ల ఏర్పాటుకు అంగీకరించినట్లు రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి ఇష్టానుసారంగా టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విషయం తెలుసుకున్న రైతులు ఆదివారం గ్రామస్తులు, తోటి రైతులతో కలిసివెళ్లి టవర్ల నిర్మాణాన్ని అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఆర్.రాధిక, కాకి పెద్ద సత్తమ్మ, చిన్న సత్తమ్మ తదితరులు మాట్లాడుతూ.. టవర్లు ఏర్పాటుకు తమను ఇప్పటి వరకు ఎవరూ సంప్రదించలేదని, తాము సంతకాలు చేసినట్లుగా అధికారులకు చూపి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పీఎస్‌లో సదరు సంస్థపై ఫోర్జరీ కేసు పెట్టామని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. వారికి గ్రామస్తులు, తోటి రైతులు, నాయకులు రూప్లానాయక్, కాకి రవి, కాకి సంతోశ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ఇద్దరి మృతి


చెట్టును ఢీకొట్టిన కారు


పర్వతాలు(ఫైల్)

యాచారం: అతివేగం ఇద్దరు ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన మండల పరిధిలోని మాల్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం వడ్డెల్లి గ్రామానికి చెందిన ఎస్.అరుణ్‌కుమార్, భార్య రుతు(21), కుటుంబ సభ్యులు ఇస్తార్, రాధిక, శ్యాం(5), బ్లెస్సీ వారి స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి మాల్ సమీపంలోని ఓ చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే రుతు, శ్యాం మృతి చెందారు. మిగిలిన క్షతగ్రాత్రులకు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన ఉస్పరి పర్వతాలు(40) ఆదివారం మాల్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభాకార్యానికి వెళ్లాడు. తన భార్య శైలజతో కలిసి మధ్యాహ్నం బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. తక్కళ్లపల్లి గేట్ సమీపంలోకి రాగనే ముందు వెళ్తున్న కారు సడన్‌గా బ్రేక్ వేయడంతో వీరి బైక్ కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పర్వతాలు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రున్ని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని చింతపట్ల గ్రామస్తులు యాచారం పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడు చింతపట్లలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు కొడుకు చరణ్, కూతురు కావ్య ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టండి

రాజేంద్రనగర్: శివరాంపల్లి నుంచి బహదూర్‌పురాకు వెళ్లే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ మార్గంలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి శివరాంపల్లి, నేషనల్ పోలీస్ అకాడమీ మీదుగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ఈ రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతుండటంతో స్థానిక ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అంబులెన్స్‌కు సైతం దారి ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని కోరుతున్నారు.